

ఓం నమో భగవతే వాసుదేవాయ

ద్వాదశాక్షర మంత్ర స్తోత్రము

మూలం: వేదవ్యాస మహర్షి

వ్యాఖ్య: స్వామి సుందర చైతన్యానంద

మున్నుడి

ముడిపడిన జీవితాలకు నుడి నందించి బ్రతుకు నడవడిని మరలించి, చీకటిలో తారాడే జీవులకు నిత్య వెలుగులను ప్రసాదించు దివ్యమైన సవ్వడియే భగవన్నామం.

తడి ఆరిన పొలాలవలె చిడిముడి చిత్తములతో జీవన వడి తగ్గి, విధి వ్రాతకు తల ఒగ్గే దీనుల నూరడించి, అశాంతిలో కుమిలే బలహీనుల నాదరించి, ఆర్తి తీర్చి, స్ఫూర్తి నిచ్చి బతుకులో దీప్తిని నిలిపే భవ్యమైన భగవత్ప్రతీకమే భగవన్నామం.

ఎక్కి పయనించడానికి ఒక్క నావ చాలు. కీర్తించి తరించడానికి ఒక్క నామం చాలు.

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఇది ద్వాదశాక్షర మహా మంత్రము. దివ్యమైన, భవ్యమైన వాసుదేవుని చైతన్య స్వరూపము. మధురమైన నామము. కాదు అమృతము.

ఈ దివ్యామృతమును ఎందరో పానం చేసి తరించారు. ఈ మంత్ర వైభవమును ఎందరో అనుభవించారు. కానీ ఎందరు ఆ వైభవమును ఆలపించ గలరు? ఆదిశేషునికి సైతము సాధ్యపడని ఈ మహత్కార్యమును మహర్షి నిర్వహించారు. నిర్వచించారు. అదియే ద్వాదశాక్షర మంత్ర స్తోత్రము.



"ఓం నమో భగవతే వాసుదేవాయ" అనెడి మంత్రములోని ఒక్కొక్క అక్షరముతో ఒక్కొక్క శ్లోకమును ప్రారంభించి పంద్రెండు శ్లోకాలతో ఈ స్తోత్రమును సంపూర్ణం చేశారు.

నా బాల్యంలో ఈ స్తోత్రాన్ని నిత్యము పారాయణ చేసేవాణ్ణి ఈ శ్లోకాలను పఠిస్తూ ఉంటే దివ్యానుభూతి అభివ్యక్తమయ్యేది. ఈ స్తోత్ర ఖనిలో నాకు ఏవేవో దొరికాయి. మీరూ అన్వేషించండి.

బాలగోపాలుని బాటలో
అవిశ్రాంత బాటసారి
మీ
స్వామి సుందర చైతన్యానంద

ద్వాదశాక్షర మంత్రస్తోత్రము

ఓం దితో ఽజ్ఞానవస్త్రేణ రాగావీకేన నిర్జితః
కర్మనిద్రాం ప్రపన్నో ఽస్మి త్రాహి మాం మధుసూదన 1

న గతి ర్విద్యతే చాన్యా త్వమేవ శరణం మమ
మాయాపంకేన లిప్తోఽస్మి త్రాహి మాం మధుసూదన 2

మో హితో మోహజాలేన పుత్రదార గృహాదిషు
తృష్ణయా పీడ్యమానోఽస్మి త్రాహి మాం మధుసూదన 3

భ క్తి హీనంచ దీనంచ దుఃఖశోక సమన్వితం
అనాశ్రయ మనాథంచ త్రాహి మాం మధుసూదన 4

గ తాగత పరిశ్రాంతో దూర మధ్వని కర్మణాం
సంసార భయ భీతోఽస్మి త్రాహి మాం మధుసూదన 5

వ సితో మాతృగర్భేషు పీడితోఽహం జనార్దన
గర్భవాస క్షయకర త్రాహి మాం మధుసూదన 6

తే న దేవ ప్రపన్నోఽస్మి త్వదాశ్రయ పరాయణః
జరామరణ భీతోఽస్మి త్రాహి మాం మధుసూదన 7

వా చాను యత్కృతం పాపం కర్మణా యదుపార్జితం
సోఽహం దేవ దురాచారం త్రాహి మాం మధుసూదన 8

సు కృతం నకృతం కించి ద్దుష్కృతంచ సదాకృతం
తేనాహం పరితప్తోఽస్మి త్రాహి మాం మధుసూదన 9

దే హాంతర సహస్రేషు కుయోని స్సేవితా మయా
తిర్యక్త్వం మనుజత్వంచ త్రాహి మాం మధుసూదన 10

వా సుదేవ! హృషీకేశ ! వైకుంఠ! పురుషోత్తమ !
సృష్టిసంహార కారణం త్రాహి మాం మధుసూదన ! 11

య త్ర యత్ర గమిష్యామి నార్యాం వా పురుషేఽపివా
తత్ర తత్ర చ తే భక్తిః త్రాహి మాం మధుసూదన 12

ఫలశ్రుతి : ద్వాదశాక్షర సంస్తుతిం యః పఠేత్ శృణుయాదపి
స యాతి పరమం స్థానం యత్ర యోగేశ్వరో హరిః

ద్వాదశాక్షర మంత్ర స్తోత్రము



శ్లో ॥ ఓందితోఽ జ్ఞానవస్త్రేణ
రాగానీకేన నిర్జితః
కర్మనిద్రాం ప్రపన్నోఽస్మి
త్రాహి మాం మధుసూదన 1

భావము :- **ఓ మధుసూదనా! నేను అజ్ఞాన వస్త్రముచే తడిసిన వాడను. రాగాది శత్రువులచే పరాజితుడను. కర్మలనెడి నిద్రలో మునిగి యున్నవాడును. అట్టి నన్ను రక్షింపుము.**

వ్యాఖ్య:- ఉన్నది, లేనిది యనెడి రెండు విషయాలు మన అనుభవమునకు అందుతున్నాయి ఉన్నది ఉన్నట్లు తెలియకపోగా లేనిది ఉన్నట్లు తెలియడమే ప్రతి ఒక్కరికి అపరిష్కృత సమస్యగా నిలిచి యున్నది.

ఉన్నట్లు ఏదయితే తెలియుచున్నదో వాస్తవానికి అది కాలగర్భంలో కలిసిపోవడను మన అనుభవమునకు అందనిది కాదు. ఈ విధముగా కనిపిస్తూ కనుమరుగయ్యే సమస్తమును వీక్షించి గ్రహించేది యేదో అది సత్యమై త్రికాలములయందు చెదరకయున్నది.

లేనిది ఉన్నట్లు తెలియడము, ఉన్నది ఉన్నట్లు తెలియక పోవుటకు కారణము అజ్ఞానము. ఈ అజ్ఞాన వస్త్రముచేత సర్వులు కప్పబడి యున్నారు. అజ్ఞాన తెర ఆవరించిన దుర్దశలో బుద్ధి సంకుచితమై అసంతృప్తికి నిలయమగు చున్నది. అసంతృప్తి వ్యాపించిన హృదయము వాస్తవానికి రణరంగమే. ఆ సమరభూమిలో కోరిక లనెడి శత్రుసైన్యము విజృంభిస్తుంది.

కోరిక లనెడి శత్రువులను యెదిరించే ప్రయత్నములో కర్మలనెడి శస్త్రములను ధరిస్తారు. పరిమితమైన కర్మలు పరిమిత ఫలముల నిచ్చి, మరల అసంతృప్తినే అందిస్తాయి. మోహములో పడదోస్తాయి.

మోహ వలయంలో పరిభ్రమించు జీవులకు అజ్ఞానమే తియ్యగా ఉంటుంది. ఇదియే **"మధు"** అనెడి రాక్షసుడుగా తెలియచున్నాడు. "మధు" వనెడి రాక్షసుని సంహరించుటచేత శ్రీకృష్ణుడు మధుసూదను డాయెను. అజ్ఞానమును పోగొట్టుకొని జ్ఞాన జ్యోతులై ప్రకాశింపగోరు ముముక్షువులు మధుసూదనుడైన శ్రీకృష్ణుని ఆశ్రయించుటయే ఏకైక శరణ్యము.

ఈ స్తోత్రము నందలి ప్రథమ శ్లోకము **"ఓందితో"** అని ప్రారంభ మగుచున్నది. వాస్తవానికి ఇచ్చట ఓంకారము లేదు. సంధిగత రూపములో 'ఓం' ప్రాప్తించినది.

"అ+ఉందితః" - అని పదచ్ఛేదము. బాగా తడిసినవాడు అని అర్థము. లేదా తడుపబడినవాడు అని అర్థము. ఇది సంధిగత రూపమున "ఓందితో" అయినది. ఇచ్చట వ్యాస భగవానుని అద్భుత కవితాశిల్పము మనకు గోచర మగుచున్నది.

"ఓం నమో భగవతే వాసుదేవాయ" అనెడి మంత్రములోని ప్రథమాక్షరమైన "ఓం" తో ప్రథమ శ్లోకము ప్రారంభ మగుచున్నది. "ఓం" అనగా సత్యము. కనుక సత్యము గాని అజ్ఞానమును ప్రథమ శ్లోకము నిరాకరించుచున్నది.



శ్లో ॥ న గతి ర్విద్యతే చాన్యా
త్వమేవ శరణం మమ
మాయాపంకేన లిప్తోఽస్మి
త్రాహి మాం మధుసూదన 2

భావము :- **ఓ మధుసూదనా! నాకు వేరే దిక్కులేదు. నిన్నే శరణు జొచ్చి యున్నాను. మాయ యనెడి బురదలో దిగబడి యున్నాను. అట్టి నన్ను రక్షింపుము.**

వ్యాఖ్య :- "ఓం నమో భగవతే వాసుదేవాయ" యనెడి ద్వాదశాక్షర మహా మంత్రములో రెండవ అక్షరమైన "న" తో రెండవశ్లోకము ప్రారంభమగుచున్నది. "న" అనగా లేదు, కాదు అని భావము. ఈ శ్లోకము "నాకు మరొక గతి లేదు" అంటూ ప్రారంభమగుచున్నది.

గతి అనగా గమ్యము అని భావము. ఈ ప్రపంచములో అనేకమంది అనేక గమ్యములను ముందు పెట్టుకొని వాటిని సాధించేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటారు. మహోన్నతమైన పదవి నధిష్టించాలని కొందరు, కోటీశ్వరులు గావలెనని మరికొందరు, పేరు ప్రఖ్యాతుల నార్జించాలని ఇంకకొందరు, సంతానమును ప్రగతిపథంలో నడపాలని వేరేకొందరు భావిస్తుంటారు. వారి జీవితాలలో అవియే గమ్యములై యుంటాయి. వారి మతులకు అందిన గతులు అవియే. ఈ గతులన్నియు చితులను పేర్చేవేగాని యతులుగా మార్చేవికావు. ఇవన్నియు మాయా నిర్మితములే.

పంకమనగా బురద యని అర్థము. మాయాపంకమనగా మాయ అనెడి బురద అని భావము. ఈ బురదను భక్తిజలంతో శుభ్రం చేసుకోవాలి. భగవంతుడే గతి యని విశ్వసించెడి పూర్ణ శరణాగతియే శుద్ధమైన భక్తి.



శ్లో ॥ మోహితో మోహజాలేన
పుత్రదార గృహాదిషు
తృష్ణయా పీడ్య మానోఽస్మి
త్రాహి మాం మధుసూదన 3

భావము :- ఓ మధుసూదనా ! గృహ దారాపుత్రాదుల యందు మోహమనెడి వలలో చిక్కుకొని యున్నాను. అత్యాశచే పీడింపబడుచున్నాను. అట్టి నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- ప్రపంచమొక క్రీడారంగము. జీవులందరు క్రీడాకారులే. సదా నీతో కలసి క్రీడించువారు నీ భార్యాపుత్రాదులు. గృహమే క్రీడాస్థలము. ఆటలన్నీ నీటిమూటలే.

ఆటలో ఎందరో కలుస్తారు. ఎందరో విడిపోతుంటారు. ఇచ్చట గెలుపు ఓటమిలు మనోకల్పితాలు. కొలిమి నుండి వెలువడే నిప్పురవ్వల వలె క్షణంలో ఆరిపోతాయి. ఇదొక మోహవలయం. మాయా నిలయం. ఈ సత్యాన్ని గ్రహించలేని జీవులు ఆశా అంబారీలో ఊరేగుతూ ఆవేదనా జ్వాలలకు ఆహుతియై కష్టాల కుంపటిలో కాలిపోతున్నారు.

ఈ బంధాలన్నీ ఒకనాడు విడిపోయేవియే. నిజమైన అందము, ఆనందము బ్రతుకులో వెల్లివిరియాలంటే అచ్యుతుడైన శ్రీకృష్ణుని ఆశ్రయించుట ఒక్కటియే మార్గము.



శ్లో ॥ భక్తి హీనంచ దీనంచ
దుఃఖశోక సమన్వితం
అనాశ్రయ మనాథంచ
త్రాహి మాం మధుసూదన 4

భావము :- ఓ మధుసూదనా ! నేను భక్తి హీనుడను. దీనుడను, దుఃఖశోకములతో కూడి యున్నవాడను. ఆశ్రయ రహితుడను. అనాథుడను.అట్టి నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- పరమాత్మ చరణకమలముల నాశ్రయించుటయే జీవితమున పొందదగిన ఏకైక ఫలము. ఐహిక భోగలాలసత్వములో కూరుకు పోయిన జీవులకు భగవత్ప్రాప్తి లభించదు.

ధనహీనుడు దరిద్రుడు కాడు. భక్తి హీనుడే దౌర్భాగ్యుడు. అన్ని ఉండినను దీనుడే. ఈ ప్రపంచములో మరొకరిపై ఆధారపడకుండా ఎవ్వరూ జీవించలేరు. పరులపై ఆధారపడి జీవించువారందరు దీనులే.

నీవు ఐశ్వర్యవంతుడవు. అందుచేత విలువైన కారును కొనగలిగావు. కానీ ఆ కారును నడిపే డ్రైవరు మీద ఆధారపడి యున్నావనే నగ్న సత్యమును మరువకు.

ఇల్లు కట్టేవారి మీద, ఇంటిని కడిగేవారి మీద బ్రతికినపుడు ఆధార పడాలి. గుంట త్రవ్వే వాడిమీద, మట్టి నింపేవాడి మీద చచ్చినపుడు ఆధారపడాలి.

దీనులైన జీవులందరు దుఃఖ శోకసమన్వితులని వ్యాసులవారు తెలుపుచున్నారు. దుఃఖ మనినను శోకమనినను ఒకటే గదా అనే సందియము రావచ్చును.

'నేను' అనెడి చోట కలిగే బాధ దుఃఖము. "నాది" యనుచోట కలిగే వ్యథ శోకము.

ఆసక్తి ఆవేదనను దింపింది. అనాసక్తి ఆనందమును నింపుతుంది. ప్రపంచముపై ఆసక్తి నశిస్తే దానిని ఆశ్రయించ నవసరము లేదు. అప్పుడు శ్రీకృష్ణుడే ఆశ్రయ స్థానంగా నిలుస్తాడు. కృష్ణుని ఆశ్రయించినవారు కృష్ణ రూపులగుదురు. తృష్ణకు దూరులగుదురు.



శ్లో ॥ గతాగత పరిశ్రాంతో
దూర మధ్వని కర్మణాం
సంసార భయ భీతోऽస్మి
త్రాహి మాం మధుసూదన 5

భావము :- ఓ మధుసూదనా ! కర్మ వలయములో చిక్కుకొని జన్మ మృత్యువు లనెడి మార్గములలో పరిశ్రాంతుడనై యున్నాను. సంసార భయముచే వ్యథ చెంది యున్నాను. అట్టి నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- అంతము లేనిది, సొంతమైనది నీకు ఏమున్నదో ఆలోచించు. భగవంతుని కన్నా అన్యమైన దంతయూ అంతరించక తప్పదు. ఈ సత్యమును గ్రహింపక పోవుటయే మోహము. సంసారిక సుఖాభిలాషకు మోహమే కారణము. ఈ మోహము వలననే సంసారిక దుఃఖములు ప్రాప్తించుచున్నవి.

కర్మ సుడిగుండంలో తగుల్కొనిన మానవులు ఎండమావులలో జలము నాశించు బాటసారులవలె ప్రపంచములో సుఖశాంతులను వాంఛించి దుఃఖతప్తు లగుచున్నారు. కనుక సంసారవృక్షచ్ఛాయలో విశ్రమించువారంతా శోకఫలములనే ఆరగిస్తున్నారు. పరమాత్మ కృపకు దూరులైనవారు ఎంతగొప్పవారైనను జననమరణ రూపమైన భయంకర సంసారచక్రములో పరిభ్రమించవలసిన వారేగాని, పరితృప్తి నొంది ప్రశాంతి ననుభవించలేరు.

దృష్టా నానా చారు దేశా స్తతః కిం పుష్టా శ్చేష్టా బంధువర్గా స్తతః కిం
నష్టం దారిద్ర్యాది దుఃఖం తతః కిం యేన స్వాత్మానైవ సాక్షాత్కృతోऽభూత్

"మనోహరములైన దేశములను వీక్షించడము జరిగినది. ఇష్టులైన చుట్టములను పోషించడమూ జరిగినది. దారిద్ర్యము సమూలముగ నశించినది. కానీ ఇవి అన్నియు ఏమి ప్రయోజనము? ఆత్మ సాక్షాత్కారము మాత్రము లభించలేదు. ఈ అనిత్య ప్రయోజనముల ప్రాశస్త్యమేమిటి?" అని శ్రీశంకరాచార్యులు ప్రశ్నించారు.

శ్లో ॥ వసితో మాతృగర్భేషు
పీడితోఽహం జనార్దన
గర్భవాస క్షయకర
త్రాహి మాం మధుసూదన 6



భావము :- జనార్దనా! వివిధములైన మాతృగర్భముల యందు వసించి పీడింపబడిన వాడను. ఓ మధుసూదనా! ఈ విధమైన గర్భవాస దుఃఖములు లేకుండా నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- కర్ణధారుడు లేని నావ ఏ క్షణానయినా మునిగిపోవచ్చు. సూత్రం తెగిన గాలిపటము మాలిన్యములో పడినా ఆశ్చర్యం లేదు. పరమాత్మకు దూరులైన జీవులు వివిధ యోనులలో వసించి, సుఖ దుఃఖముల ననుభవించక తప్పదు. ద్వంద్వముల మధ్య ఊగిసలాడక తప్పదు. గర్భవాసము నందు జీవులు పొందు దుఃఖము అనూహ్యము.

మలమూత్రములకు నిలయమైన గర్భమున వసించు క్రిములతోపాటు జీవుడు వసించును. అంగములను కదలించలేక త్రాళ్ళతో బంధించిన పక్షివలె పడియుండును. గర్భవాసియగు జీవుని మనోవేదనను గర్భోపనిషత్తు ఈ క్రింది విధముగా వివరించినది.

పురా పరజన స్యార్థే కృతం కర్మ శుభాశుభమ్
ఏకాకీ తేన దహ్యామి గతాస్తే ఫలభాగినః

"నేను ఇతరులను సుఖపెట్టుటకు గతంలో కర్మల నాచరించితిని. నేడు ఆ కర్మల ఫలితముగ ప్రాప్తించిన దుఃఖములను నేను ఒంటరిగ అనుభవించు చున్నాను. ఫలాల ననుభవించిన వారంతా పలాయనమయ్యారు.

ఈ విధమైన గర్భవాస దుఃఖములు లేకుండా జీవింపవలెనన్నచో అచ్యుతుని అనుగ్రహమునకు పాత్రు లగుటయే ఏకైక మార్గము. అది శుద్ధ భక్తి ద్వారానే లభ్యము.

శ్లో ॥ తేన దేవ ప్రపన్నోఽస్మి
త్వదాశ్రయ పరాయణః
జరామరణ భీతోఽస్మి
త్రాహిమాం మధుసూదన 7



భావము :- ఓ దేవా! నీకు నేను ప్రపన్నుడను. నీవే ఆశ్రయ స్థానమని విశ్వసించిన వాడను. ఓ మధుసూదనా! జనన మరణముల వలన భీతి చెందిన వాడను. అట్టి నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- జన్మించిన ప్రతి ఒక్కరు మరణించక తప్పదు. మరణమనేది ఒకనాడు ప్రాప్తించేది కాదు. ఒక క్షణాన లభించేది కాదు. దేహము అనునిత్యము మరణించుచునే యున్నది. పుట్టిన నాటినుండి క్షణక్షణము శరీరము చస్తూనే ఉంది. ఈ సత్యమును మన బుద్ధి అందుకోలేక పోతున్నది. చావడమనే ప్రక్రియ పొత్తికల నుండే ప్రారంభమైనది. మరణంతో సమాప్త మగుచున్నది.

మరణాన్ని చూసి సర్వులు భీతి చెందు చున్నారు. అంతరించిన వాటికై వగచడం అలవాటుగా మారింది. వ్యసనంగా తయారైంది. సూర్యుడు అస్తమిస్తున్నాడు. అందరి గృహాలు అంధకార బంధుర మవుతున్నాయి. మరి ఎవరూ విలపించుట లేదు. ఎందుకని? ఉదయించిన సూర్యుడు అస్తమించక మానడు అనే సత్యము అనుభవానికి అందుటచేత ఎవ్వరూ దుఃఖించుట లేదు. పైగా చీకట్లను చెదర గొట్టుటకు దీపములను వెలిగిస్తున్నారు.

పెరిగేది విరగక తప్పదు. వికసించినది వాడక మానదు. భవంతులు కూలి పోయాయి. దేహాలు రాలిపోతాయి.

జరిగేవి జరుగక మానవు. వాటిని ఆపాలని చేసే ప్రయత్నమే సర్వ దుఃఖములకు కారణమై యున్నది. కనుక జారిపోయే వాటిని పట్టుకొనే ప్రయత్నం కన్నా, దారిని దర్శించి దరి చేరడమే ఉత్తమము. గిరిధారిని విశ్వసించి శాంతితీరమును చేరడమే శ్రేయస్కరము.

త్వదన్యః శరణ్యః ప్రపన్నస్య నేతి ప్రసీద స్మరన్నేవ హన్యాస్తు దైన్యం
న చేత్తే భవే ద్భక్తవాత్సల్యహాని స్తతో మే దయాలో! సదా సన్నిధేహి ॥

"హే దయామయా! నీవు దప్ప నాకు మరొక శరణ్యము శూన్యము. నేను నిన్ను వీడి మరొకరిని ఆశ్రయించలేను. స్మరించినంత మాత్రాన నీవు దీనులను, దురదృష్టవంతులను కరుణించి యున్నావు. నిన్ను నమ్మిన భక్తులను నీవు తృణీకరించవు. ఓ దయామయా! నన్ను కరుణింపుము." ఈ విధంగా పరమాత్మను ప్రార్థించి, జనన మరణ రూప సంసార సాగరమును దాటి తరింపుమని ఆదిశంకరులు శివభుజంగ స్తోత్రములో తెలుపుతారు.

శ్లో ॥ వాచాను యత్కృతం పాపం
కర్మణా యదుపార్జితం
సోఽహం దేవ దురాచారం
త్రాహి మాం మధుసూదన 8



భావము :- ఓ మధుసూదనా ! మాటల ద్వారా పాపము లొనరించిన వాడను. కర్మల ద్వారా పాపములను సంపాదించిన వాడను. దురాచారుడను. అట్టి నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- జన్మాంతర దుష్టవాసనలు దుష్ట కర్మములకు నాంది పలుకుతాయి. కర్మలను మార్చాలని ప్రయత్నించి సాధించేదుండదు. వాసనలు మారినపుడే బ్రతుకు నూతన మార్గంలో పయనిస్తుంది. అసుర భావములను అంతం చేయాలి. దైవీ సంపదను మనసుకు పట్టించాలి.

నోరులేని జంతువులు మూగబ్రతుకును సాగిస్తున్నాయి. నోరున్న మానవుడు భోగజీవితమును అనుభవిస్తున్నాడు. భోగ రొంపిలో దిగి యోగాన్ని విస్మరించాడు. యోగ్యాన్ని మరచాడు.

ప్రార్థించేందుకు నాలుక ప్రసాదించబడింది. అది ఇంతవరకు పదులను దూషించుటకు అలవాటు పడింది. సత్కర్మల నాచరించుటకు ప్రసాదించబడిన కర్మేంద్రియాలు దుష్కర్మల పాలయ్యాయి. జ్ఞాన సముపార్జనకు లభించిన జ్ఞానేంద్రియాలు అజ్ఞాన వీధుల్లో విహరిస్తున్నాయి. మనస్సు మాయలో కూరుకు పోయింది. బుద్ధి సంసార బురదలో దిగబడిపోయింది. సదాచారము సుదూరములో మకాం పెట్టగా, దురాచారము దగ్గర బంధువై కులుకుతున్నది.

We should not cry over spilt milk

నేల ఒలికిన పాలకోసం వగచి సాధించే దేముంటుంది? అని ఆంగ్ల సామెత.

గతం గతించింది. గతిని తెలిసి మతిని నడుపుకోవాలి. భక్తిని పెంచు కోవాలి. ఆత్మస్థైర్యమును పెంపొందించు కోవాలి. మురారి నాశ్రయించాలి. ముక్తిధామ మలంకరించాలి.



శ్లో ॥ సుకృతం నకృతం కించి
దుష్కృతం చ సదాకృతం
తేనాహం పరితప్తోఽస్మి
త్రాహి మాం మధుసూదన 9

భావము :- ఓ మధుసూదనా ! కొంచెమైనను పుణ్యకార్యము చేసిన వాడను గాను. ఎల్లప్పుడు పాపకార్యములనే ఆచరింతిని. ఈ పాపములచేత పరితాపము జెందియున్నాను. ఇట్టి నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- పంటలు పండించాలనే ప్రయత్నములో మనం పెట్టే బాధలను భూమాత సహనంతో భరిస్తూ ఉంది. పండ్లను అందించాలనే సంకల్పముతో పూలు ఆనందంగా

రాలిపోతున్నాయి. పాల నివ్వాలనే ఉద్దేశ్యముతో ఆవులు గడ్డి మేస్తున్నాయి. వాన లిచ్చేందుకు మబ్బులు దూరంగా పయనిస్తున్నాయి. మనోబుద్ధలున్న మానవుడు ఈనాటికి చేసిందేమిటి?

పుణ్యము ఇసుమంతైనను లేదు. బ్రతుకంతా పాపపు కసువే. అనుభవించకుండా నశించినిది ఏదియో అదియే పాపము. పుణ్యఫలమును "కృష్ణార్పణం" చేయవచ్చు. పాపఫలమును మనమే అనుభవించాలి. అయినా మానవుడు పాప కర్మాచరణమును మానుట లేదు.

మానవుడు అనే పదానికి మహాత్ములు అనేక అర్థాలు తెలిపియున్నారు. "మా" అంటే మాయను "న" అంటే అంటకుండ, "వ" అంటే వర్తించువాడు అనికూడ చెప్పియున్నారు.

అనేక జన్మలలో అసంఖ్యాకములైన దురితములను ఆచరించిన దోషానికి నేడు దుర్గతిని అనుభవించు చున్నాము. అయినా దుష్టకర్మలను మానవులు మానలేక యున్నారు.

"మానవా! ఈ పాడు కర్మలు మానవా! మానలేవా!" కనుక మానవా! అనగానే ఇకనైనను దుష్కర్మలను మానవా! అనే హెచ్చరిక వినిపిస్తూనే ఉంది.

పరితపిస్తున్నావా? పశ్చాత్తాపముతో కుమిలిపోతున్నావా? భయపడకు .భగవానుని అభయహస్తము నిన్ను రక్షిస్తుంది. గీతామాత అమర సందేశము నిన్ను బుజ్జగిస్తుంది. విను.

అపి చేత్సు దురాచారో భజతే మామనన్య భాక్
సాధురేవ స మంతవ్య స్సమ్యగ్వ్యవసితో హి సః

"దురాచారవంతుడైనను, అనన్య భక్తి కలవాడై నన్ను భజించునేని, స్థిర చిత్తము గలవాడైన అతడు సాధువే యని యెంచబడును" భగవద్గీత రాజవిద్యా రాజగుహ్య యోగములో భగవానుడు తెలిపి యున్నాడు.



శ్లో ॥ దేహాంతర సహస్రేషు
కుయోని స్సేవితా మయా
తిర్యక్త్వం మనుజత్వంచ
త్రాహి మాం మధుసూదన 10

భావము :- ఓ మధుసూదనా ! వేలకొలది జన్మలలో పశుపక్ష్యాదులు యందును, మానవుల యందును, అనేక అధమ జన్మ లెత్తి యున్నాను. అట్టి నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- అనేక పశుపక్ష్యాదుల యోనుల యందు ప్రవేశించిన పిదప, ఈనాడు జీవునకు మనుష్య జన్మ లభించినది. దుర్లభమైన నరజన్మ ప్రాప్తించినది.

జీవులు అనేక కర్మల నాచరించు చుందురు. కేవలము పుణ్యకర్మల నాచరించిన వారు దేవతా శరీరములను ధరిస్తారు. దుఃఖరహిత స్థితిని అనుభవిస్తారు. కేవలము పాపకర్మల నాచరించువారు తిర్యగ్యోనుల యందు ప్రవేశిస్తారు. మిశ్రమ కర్మల నాచరించువారు తత్ఫలితములైన మంచి చెడులను అనుభవించుటకు మానవజన్మ నెత్తుచుందురు.

గతంలో పశుపక్ష్యాదుల యోనుల యందు ప్రవేశించినను, కాలంలో పరిణితిని పొందుట వలననే నేడు మానవజన్మ లభించినది. ఇది ప్రగతి సోపానమనుటలో సందేహము లేదు.

విచ్చైన నెక్కునపుడు పైకి ఎగబ్రాకాలే గాని, క్రిందికి దిగజారకూడదు. వానరుడు నరుడైనపుడు, నరుడు నారాయణుడై తీరాలి. ఇదియే ప్రగతి మార్గం. పవిత్ర మార్గం.



శ్లో ॥ వాసుదేవ! హృషీకేశ!
వైకుంఠ! పురుషోత్తమ!
సృష్టిసంహార కారణ్యం
త్రాహి మాం మధుసూదన! 11

భావము :- ఓ వాసుదేవా ! హృషీకేశ ! వైకుంఠవాసా ! పురుషోత్తమ ! నీవు సృష్టి, స్థితి, సంహార కారకుడవు. ఓ మధుసూదనా ! కనుక నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- సర్వారిష్టము లంతరించి, సర్వోపద్రవములు నశించి, సర్వాభీష్టములు సిద్ధించే స్థితి ప్రాప్తించుటకు సర్వశక్తి మంతుడైన శ్యామసుందరుని ఆశ్రయించుటయే ఏకైక మార్గము.

శ్యామసుందరుడు వాసుదేవుడు. అనగా సర్వుల యందు వసించువాడు. అట్టివాని కృపవలన సమదర్శనము లభించగలదు.

వాసుదేవుడైన శ్రీకృష్ణుడు హృషీకేశుడు. కనుక ఇంద్రియములను నియమించి, మనోబుద్ధులు అంతర్ముఖ మగునట్లు ఆశీర్వదించును.

హృషీకేశు డైన గోవిందుడు వైకుంఠవాసుడు. వైకల్యమును తొలగించి కైవల్యమును ప్రసాదించును. విలాపాలను, విలాసాలను అదృశ్యం చేసి కైలాసమును హృదిలో దింపును.

వైకుంఠవాసుడైన విష్ణుదేవుడు పురుషోత్తముడు. నవద్వార పురమునందు నిరంజన రూపుడైన పురుషోత్తమ చైతన్యమును సాక్షాత్కరింపచేయును.

భక్తిని మదిలో సృష్టించును. ముక్తిని హృదిలో స్థిరపరచును. అవిద్యను సమూలంగా సంహరించును.



శ్లో ॥ యత్ర యత్ర గమిష్యామి
నార్యాం వా పురుషేఽపివా
తత్ర తత్ర చ తే భక్తిః
త్రాహి మాం మధుసూదన 12

భావము :- ఓ మధుసూదనా ! ఎక్కడెక్కడ నేను స్త్రీపురుష రూపములలో జన్మించినను అక్కడక్కడ ,నీ భక్తి నాకు కలుగునట్లు అనుగ్రహించి ,నన్ను రక్షింపుము.

వ్యాఖ్య:- దేశము మారవచ్చు. సందేశము మారకూడదు. కాలం మారవచ్చు. భక్తికి సానుకూలం చెడకూడదు. ఆకృతి ఏదైనా పరాశక్తి స్థిరంగా నిలవాలి. భక్తి నిలవాలి. వ్యక్తి ముక్తి వైపుకే సాగాలి. ముక్తపురుషుడై మెలగాలి. హే భగవాన్ ! ఇలా అనుగ్రహించు. ఇలలోనైనా, కలలోనైనా నీవు నాకు దూరంగాకు. భారంగాకు.

ఫలశ్రుతి

ద్వాదశాక్షర సంస్తుతిం యః
పఠేత్ శృణుయాదపి
న యాతి పరమం స్థానం
యత్ర యోగేశ్వరో హరిః

భావము :- ఈ ద్వాదశాక్షర స్తోత్రమును ఎవడు పఠించునో, శ్రవణము చేయునో, అట్టివాడు యోగేశ్వరుడైన శ్రీహరి నిలయమగు పరంధామమును పొందును.

వ్యాఖ్య:- పారే నీరు మలిన మెరుగదు. తిరిగే రాతికి పాచిపట్టదు. భక్తి ఓటమి నెరుగదు. భక్తుడు పతన మెరుగడు. నమ్మినవారు చెడలేదు. నమ్మనివారు బాగు పడలేదు. బాగు తెలిసి బ్రతుకు హాయిగా సాగాలంటే భగవన్నామమే భవ్యము. దివ్యము. నామాలెన్నో ఉన్నాయి! నీ కెన్ని కావాలి? ఒక్కటి చాలు. ఇందులో సందేహమునకు తావులేదు. సంశయ రహితునకు చావులేదు. ఏమిటా నామం? వాసుదేవ నామం. ఏమిటా మంత్రం? ఓం నమో భగవతే వాసుదేవాయ.